ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
బుధవారం, 07 అక్టోబర్ 2026 | సంపుటి: 02 | సంచిక: 48 | పేజీలు: 4 | వెల: 5

# మంచు కింద విశ్వ రహస్యాలు

## న్యూట్రినోల అన్వేషణకు నోబెల్ కిరీటం

- ఐస్‌క్యూబ్‌తో సరికొత్త ఖగోళ శాస్త్రానికి బాటలు
- దక్షిణ ధ్రువ మంచులో విశ్వ కణాల జాడ
- 82 ఏళ్ల శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు అరుదైన గౌరవం
- 1.2 మిలియన్ అమెరికన్ డాలర్ల నగదు బహుమతి
- నోబెల్ ఫిజిక్స్ కమిటీ చైర్మన్ మార్క్ పియర్స్



**కాకతీయ, నేషనల్ డెస్క్ :** అత్యంత శక్తివంతమైన ఖగోళ మూలాల న్యూట్రినోలను గుర్తించడంతో పాటు ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటులో విశేష సేవలందించిన ప్రఖ్యాత శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ ఈ ఏడాది భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. స్టాక్‌హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో నోబెల్ అకాడమీ ఆయన పేరును అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది పురస్కారం కింద 1.2 మిలియన్ అమెరికన్ డాలర్ల నగదు బహుమతి అందనుంది. నోబెల్ ఫిజిక్స్ కమిటీ చైర్మన్ మార్క్ పియర్స్ మాట్లాడుతూ, అంతర్జాతీయ పరిశోధకులు, ఇంజినీర్ల బృందానికి నాయకత్వం వహించిన హాల్జెన్ ప్రపంచానికి అద్భుతమైన పరికరాన్ని అందించారని ప్రశంసించారు. ఆయన పట్టుదల, శాస్త్రీయ దృక్పథం సరికొత్త ఖగోళ శాస్త్రానికి బాటలు వేశాయని కొనియాడారు. బెల్జియంలో జన్మించిన 82 ఏళ్ల ఫ్రాన్సిస్ హాల్జెన్ ప్రస్తుతం అమెరికాలోని విస్కాన్సిన్-మాడిసన్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్నారు. తాను నోబెల్ బహుమతి గెలుచుకుంటానని ముందే అంచనా వేసినప్పటికీ, ప్రకటన వెలువడిన తీరు తనకు ఇంకా వింతగానే అనిపించిందని ఆయన పేర్కొన్నారు.

**భూత కణాల వేట**

న్యూట్రినోలను శాస్త్రవేత్తలు భూత కణాలుగా భావిస్తారు. ఇవి అత్యంత సూక్ష్మమైన

........(తరువాయి 2లో)



- రాష్ట్రంలో 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం
- ప్రపంచంలో ఎక్కడా లేని కార్యక్రమం తెలంగాణలోనే
- బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు
- నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- మునగాలలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు శంకుస్థాపన

# సంక్షేమం..వృద్ధికి పెట్టుబడే

## విద్యార్థుల పౌష్టికాహారమే రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడి



**కాకతీయ, కోదాడ :** రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే తొలిసారిగా ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం ఉచితం కాదని, రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడిగా చూడాలని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పత్తికి పెద్దఎత్తున తోడ్పడతారని, తద్వారా జీఎస్‌డీపీ వృద్ధికి దోహదపడతారని తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం మునగాలలో రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. 1,020 పాఠశాలల్లోని దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి పరిశుభ్రమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పాహారం అందించేందుకు గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని,

........(తరువాయి 2లో)

# కాంక్రీట్‌తో రాజన్న గుడి నిర్మాణమా?

- కృష్ణశిలతో ఆగమ శాస్త్రం ప్రకారం రాజన్న ఆలయాన్ని నిర్మించాలి
- రైతులకు నవంబర్ వరకు 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే
- సిరిసిల్ల సెస్‌లో రూ.32 కోట్ల అవినీతిపై విచారణ జరపాలి
- కాళేశ్వరంతో సిరిసిల్ల, వేములవాడకు ఒరిగిందేమీ లేదు
- నేరెళ్ల బాధితులకు కోటి పరిహారం, 3 ఎకరాల భూమి, ఉద్యోగం ఇవ్వాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

3



# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

- ఫారమ్-6 ఓటరు నమోదుకు మాత్రమే..
- ఫారమ్-7పై నిబంధనలు స్పష్టం
- ఓటర్ల జాబితా శుద్ధీకరణను రాజకీయ కుట్రగా చిత్రీకరించొద్దు
- నకిలీ, డూప్లికేట్ ఓట్లపై ఆధారాలు చూపాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు



2



2

# కొటాలలో అరుదైన నక్షత్ర తాబేలు ప్రత్యక్షం

అటవీశాఖకు సమాచారం.. సురక్షితంగా అడవిలోకి తరలింపు

# తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

- అక్టోబర్ 11 నుంచి 20 వరకు ప్రత్యేక దర్శనాలపై ఆంక్షలు
- అక్టోబర్ 7న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల విడుదల



2

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

- 67 రోజుల తర్వాత జైలు నుంచి విడుదలకు మార్గం
- మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో నమోదైన కేసు
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన ఉప్పర్‌పల్లి కోర్టు
- అత్తాపూర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు
- ఆరోపణలు అవాస్తవమన్న ఉదయ్ కృష్ణారెడ్డి



3



2

# రేవంత్, కేసీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆరోపణలపై న్యాయ విచారణ అవసరం
- ఎన్నికల అఫిడవిట్లలోని ఆస్తులతోపాటు అదనపు ఆస్తులపైనా దర్యాప్తు చేయాలి
- ప్రజలకు వాస్తవాలు తెలియాలి
- పరస్పర ఆరోపణల నిజానిజాలు నిగ్గు తేల్చాలి
- బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- ఆస్తులపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు

# 10న భూదోపిడీ బయటపెడుతాం

- 200 కేస్ స్టడీల్లో తొలి విడతలో కొన్ని బహిర్గతం చేస్తాం
- భారీగానే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల భూ దోపిడీ
- ధరణి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను తొక్కిపెట్టారు
- కూకట్‌పల్లి భూముల కబ్జాపై ఆధారాలున్నాయి
- లక్షల ఎకరాలపై సీబీఐ విచారణ జరపాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ప్రజా సమస్యలను గాలికొదిలేసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఎవరు ఎంత దోచుకున్నారంటూ ఆస్తుల చిట్టాలు బయటపెట్టుకుంటూ బాహాటంగా కొట్లాడుకుంటున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి, కేటీఆర్ వర్గాలు పరస్పరం బయటపెట్టుకున్న ఆస్తుల చిట్టాలు రాష్ట్రంలో జరిగిన భూదోపిడీలో కేవలం

........(తరువాయి 2లో)

# కరెంట్ కోతలు.. బిల్లులతో వాతలు

## రూ.5,420 కోట్ల భారం మోపే హక్కు ఎవరిచ్చారు

- కరెంట్ ఇవ్వలేని ప్రభుత్వం బిల్లులు పెంచుతుందా?
- కేసీఆర్ నిర్మించిన విద్యుత్ వ్యవస్థను నడపలేకపోతున్నారు
- బొగ్గు, నీళ్లు ఉన్నా విద్యుత్ ఉత్పత్తి ఎందుకు చేయడం లేదు
- ట్రాన్స్‌కో సహా విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ఒకవైపు కరెంట్ కోతలు, మరోవైపు పెరిగిన కరెంట్ బిల్లులతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలకు శుభవార్త చెప్పాల్సిన ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో ఏకంగా రూ.5,420 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపేందుకు సిద్ధమైందని మండిపడ్డారు. విద్యుత్ కొనుగోళ్లకు వెచ్చించిన మొత్తాన్ని వినియోగదారుల నుంచే వసూలు చేయాలని నిర్ణయించడానికి రేవంత్‌రెడ్డికి హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలు ఎందుకు మూల్యం చెల్లించాలని నిలదీశారు. ట్రూ అప్ ఛార్జీల నిర్ణయాన్ని వెంటనే

........(తరువాయి 2లో)

# కరెంట్ కోతలు.. బిల్లులతో వాతలు

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరించుకోవాలని, రూ.5,420 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

**బషీర్‌బాగ్ నుంచి విద్యుత్ ఉద్యమం వరకు**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. విద్యుత్ సమస్య నుంచే తెలంగాణ ఉద్యమ పోరాటం ప్రారంభమైందని గుర్తుచేశారు. బషీర్‌బాగ్ కాల్పుల ఘటన జరిగి 26 ఏళ్లు పూర్తయ్యాయని, ఆ కాల్పులను చూసిన కేసీఆర్ కరెంట్ కష్టాలకు చరమగీతం పాడాలనే లక్ష్యంతో పదవికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పేరుతో అర్ధరాత్రి కరెంట్ ఇచ్చేవారని, తెలంగాణ వస్తే రాష్ట్రం అంధకారమవుతుందని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారని పేర్కొన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తామని కేసీఆర్ చెప్పినప్పుడు జానారెడ్డి కూడా నమ్మలేదని, అసాధ్యంగా కనిపించిన దాన్ని కేసీఆర్ సుసాధ్యం చేశారని అన్నారు. కానీ ఇప్పుడు కరెంట్ ఉంటే వార్తగా మారే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

**రూ.91 వేల కోట్లతో విద్యుత్ రంగం బలోపేతం**

కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో విద్యుత్ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి రూ.91 వేల కోట్లతో జెన్‌కో, ట్రాన్స్‌కో అభివృద్ధితో పాటు మౌలిక వసతులను బలోపేతం చేసిందని హరీశ్‌రావు తెలిపారు. 2014కు ముందు 6గా ఉన్న 400 కేవీ సబ్‌స్టేషన్లను 30కి, 51గా ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్లను 103కు, 176గా ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్లను 251కు పెంచామని చెప్పారు. ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు 233 నుంచి 384కు, ఈహెచ్‌టీ లైన్ల సర్క్యూట్ పొడవు 16,378 కిలోమీటర్ల నుంచి 28,131 కిలోమీటర్లకు, ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం 14,973 ఎంవీఏ నుంచి 38,941 ఎంవీఏకు పెంచామని వివరించారు. మొత్తంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి 19,450 మెగావాట్లకు పెంచి రాష్ట్రాన్ని పవర్‌ఫుల్ తెలంగాణగా నిలబెట్టామని, అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించే స్థాయికి వ్యవస్థను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు.

**థర్మల్, సోలార్ సామర్థ్యం పెంచాం**

కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 42 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించామని, భద్రాద్రిలో 1,080 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించామని హరీశ్‌రావు తెలిపారు. 4,000 మెగావాట్ల ఆల్ట్రా థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని, భూపాలపల్లిలో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఒక్క థర్మల్ రంగంలోనే 6,480 మెగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని, సోలార్ విద్యుత్‌లో మరో 3,600 మెగావాట్లు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. మరోవైపు సింగరేణి ఆధారంగా 800 మెగావాట్ల విద్యుత్ విషయంలో రాజస్థాన్‌తో జాయింట్ వెంచర్ చేసుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క సబ్‌స్టేషన్ కూడా నిర్మించలేదని, ఒక్క మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా పెంచలేదని విమర్శించారు.

**ఎల్‌నినో కాదు.. కాంగ్రెస్ కరువు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్‌కే కరోనా పట్టినట్లుగా పరిస్థితి మారిందని హరీశ్‌రావు విమర్శించారు. ఎల్‌నినో, కరువు పేరుతో ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటోందని అన్నారు. అవకాశం ఉన్నా నీటిని వినియోగించుకోవడం లేదని, విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదని చెప్పారు. కేసీఆర్ హయాంలో 24 గంటల విద్యుత్ సరఫరా జరిగితే ఇప్పుడు 6 గంటలు కూడా కరెంట్ రాని పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. దేవాదులలో 24 గంటలు మోటార్లు నడపాల్సి ఉండగా 8 గంటలే నడుపుతున్నారని, దీంతో వరంగల్ ప్రాంతానికి కరువు వచ్చిందని అన్నారు. కల్వకుర్తి ప్రాజెక్టులోనూ నీటిని ఎత్తిపోయడానికి మోటార్లను 8 గంటలే నడుపుతున్నారని ఆరోపించారు. కన్నెపల్లి వద్ద నీటిని ఎత్తే విషయంలో ఎన్‌డీఎస్‌ఏను కారణంగా చూపారని, అయితే అదే సంస్థకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని వ్యాఖ్యానించారు.

**బొగ్గు, నీళ్లు ఉన్నా ఉత్పత్తి ఎందుకు లేదు**

భద్రాద్రి, యాదాద్రి, సింగరేణి థర్మల్, కేటీపీఎస్ వంటి విద్యుత్ కేంద్రాలను నిర్మించినా వాటిని నడిపించే సామర్థ్యం ప్రభుత్వానికి లేదని హరీశ్‌రావు విమర్శించారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో మూడో యూనిట్ ఉత్పత్తి ఎందుకు నిలిచిపోయిందని ప్రశ్నించారు. 4,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యాదాద్రి పవర్ ప్లాంట్ 400 మెగావాట్లు కూడా ఉత్పత్తి చేయడం లేదని అన్నారు. సింగరేణి బొగ్గు సంస్థ ఉన్నప్పటికీ సింగరేణి థర్మల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేయలేని పరిస్థితి ఎందుకొచ్చిందని నిలదీశారు. నదుల్లో నీళ్లు ఉన్నా రిజర్వాయర్లు నింపడం లేదని, నీటిని లిఫ్ట్ చేయడం లేదని, బొగ్గు ఉన్నా విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయడం లేదని ఆరోపించారు. రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు మాయమయ్యాయని తాము గతంలోనే హెచ్చరించామని, లేని నిల్వలను ఉన్నట్లు చూపించి పన్ను, కోల్ సెస్, సీఎస్ఆర్ చెల్లింపులు చేశారనే అంశంపై సింగరేణి ప్రాంతాల్లో తిరిగి పీపీపీ ప్రజెంటేషన్లు ఇచ్చామని తెలిపారు. బొగ్గు కుప్పలపై సేల్ బొగ్గు వేసి కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, ఇప్పుడు కరెంట్ లేకపోవడానికి ఎల్‌నినోను కారణంగా చూపుతున్నారని విమర్శించారు.

**రైతులకు మళ్లీ కరెంట్ కష్టాలు**

ప్రభుత్వానికి పాలనపై దృష్టి కంటే ప్రతిపక్షాలపై బురదజల్లడంపైనే ఆసక్తి ఎక్కువగా ఉందని హరీశ్‌రావు అన్నారు. రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉచిత కరెంట్ పేటెంట్ కాకుండా పేషెంట్‌గా మారిందని వ్యాఖ్యానించారు. పంటను కాపాడుకునేందుకు కరెంట్ లేక, నీళ్లు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. నీ కొండారెడ్డిపల్లిలోనే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే రేవంత్‌రెడ్డికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎప్పుడు కరెంట్ వస్తుందో తెలియక పొలాల వద్ద వేచి చూస్తున్న రైతులు పాము కాట్లకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. కరెంట్ కోతలు, లోఓల్టేజీతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఇబ్బందులు పడుతున్నాయని, ఉమ్మడి పాలనలో చూసిన క్రాప్ హాలిడే, పవర్ హాలిడేలను మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తోందని విమర్శించారు.

**140 మిలియన్ యూనిట్ల సామర్థ్యం ఎందుకు వినియోగించడం లేదు**

కేసీఆర్ ప్రభుత్వం రోజుకు 140 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తే ప్రస్తుతం అందులో 100 నుంచి 110 మిలియన్ యూనిట్లు కూడా ఉత్పత్తి చేయడం లేదని హరీశ్‌రావు అన్నారు. బొగ్గు కొరత, నీటి కొరత, నిర్వహణ లోపాలే ఇందుకు కారణమని విమర్శించారు. యాదాద్రి జనరేషన్ సామర్థ్యం 96 మిలియన్ యూనిట్లు ఉంటే 39 మిలియన్ యూనిట్లు కూడా దాటడం లేదని పేర్కొన్నారు. ఉన్న విద్యుత్ సామర్థ్యాన్ని వినియోగించుకోకుండా బయట నుంచి యూనిట్‌కు రూ.10 నుంచి రూ.12 వరకు చెల్లించి విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలోని మొత్తం థర్మల్ విద్యుత్ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 13,384 మెగావాట్లు ఉంటే 8,000 మెగావాట్లు కూడా ఉత్పత్తి చేయడం లేదని, 40 నుంచి 45 శాతం గ్యాప్ ఎందుకొచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**అధిక ధరకు బొగ్గు దిగుమతులపై ప్రశ్నలు**

నైనీ బొగ్గు గనుల్లో మంచి నాణ్యత గల బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ దాన్ని వినియోగించకుండా విదేశాల నుంచి అధిక ధరకు బొగ్గు దిగుమతి చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చెప్పిన వ్యవహారం కుంభకోణమని తాము బయటపెట్టామని, ఈ అంశంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాసినా చర్యలు తీసుకోలేదని అన్నారు. బొగ్గు నిల్వలు చేసుకోవడంలో, రిజర్వాయర్లు నింపి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేయడంలో, హైడల్ విద్యుత్ ఉత్పత్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆ వైఫల్యాలకు ప్రజలు ఎందుకు మూల్యం చెల్లించాలని ప్రశ్నించారు.

**ట్రాన్స్‌కోను ప్రైవేటీకరించే ప్రయత్నం ఆపాలి**

ఇవన్నీ చాలవన్నట్లు రాష్ట్ర విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌లో 26 శాతం వాటాలను విక్రయించేందుకు ప్రభుత్వం నిర్ణయించుకుందని హరీశ్‌రావు విమర్శించారు. వేల కోట్ల విలువైన ప్రభుత్వ రంగ ఆస్తులను పైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, టీజీట్రాన్స్‌కో, టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంల ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆరోపించారు. యాదాద్రిలో యాష్, కోల్ ప్లాంట్ల ప్రైవేటీకరణ ఇప్పటికే పూర్తయిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించొద్దని రాహుల్‌గాంధీ చెబుతున్న నేపథ్యంలో తెలంగాణలో జరుగుతున్న ప్రైవేటీకరణను ఆయన అడ్డుకోవాలని కోరారు. కేసీఆర్ హయాంలో ప్రైవేట్ సంస్థలు థర్మల్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నా అంగీకరించలేదని, యాదాద్రి, భద్రాద్రి, సింగరేణి ప్లాంట్లను నిర్మించి ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేశామని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయాలపై పోరాటం చేయాలని, ప్రైవేటీకరణ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని పిలుపునిచ్చారు.

**ప్రజా పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం**

విద్యుత్ రంగంలో ప్రభుత్వం చేసిన వైఫల్యాలకు ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.5,420 కోట్ల భారం మోపడం సరికాదని హరీశ్‌రావు అన్నారు. కరెంట్ కోతలు ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమైతే, పెంచిన బిల్లుల భారం ప్రజా వ్యతిరేక విధానానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. సరిగ్గా 16 ఏళ్ల క్రితం చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిన నేపథ్యంలో బషీర్‌బాగ్ కాల్పుల వరకు పరిస్థితి వెళ్లిందని గుర్తుచేస్తూ.. ఇప్పుడు ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపి ఏం చేయదల్చుకున్నారని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అప్పట్లో విద్యుత్ బిల్లులపై పోరాడిన కమ్యూనిస్టులు ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయాలకు మద్దతు ఇవ్వకుండా బీఆర్ఎస్ చేపట్టే పోరాటంలో కలిసి రావాలని కోరారు. రూ.5,420 కోట్ల ట్రూ అప్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు.

# సంక్షేమం.. వృద్ధికి పెట్టుబడే

(మొదటిపేజీ తరువాయి)

మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ ఇస్తున్నామని చెప్పారు.

**సంక్షేమం..**

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెట్టుబడి**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా చూడొద్దని, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులపై చేస్తున్న ఖర్చు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తిరిగి ప్రయోజనం చేకూర్చే పెట్టుబడని భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాల ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరిగి జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలపై భట్టి విక్రమార్క స్పందిస్తూ.. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ వస్తామని చెబుతున్నారని, అసలు ఏం చేయడానికి వస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ఆపడానికి వస్తారా? సన్నబియ్యం పంపిణీ నిలిపివేయడానికి వస్తారా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఆపడానికి వస్తారా? మహిళల వడ్డీలేని రుణాలు నిలిపివేయడానికి వస్తారా? పేద విద్యార్థులకు అందుతున్న ఆర్థిక సాయాన్ని ఆపడానికి వస్తారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు.

**నవంబర్ 19న కుటుంబ బీమా**

ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రారంభించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కుటుంబ యజమానికి అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భద్రత కల్పించేలా పథకాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతి కుటుంబం తమకు భద్రత ఉందనే ధైర్యంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే పాఠశాలలో ఒకే కుటుంబంలా చదువుకునేలా వీటిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు క్రీడలు, స్టేడియం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలే తమ కుటుంబమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భావిస్తారని, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులు లభించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని భట్టి అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారాన్ని ప్రదర్శించేందుకు కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతను నెరవేర్చేందుకు పనిచేయాలని పేర్కొన్నారు. మునగాల హెలిప్యాడ్ నుంచి కిచెన్ శంకుస్థాపన ప్రాంతం వరకు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు సుమారు 500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని భట్టి విక్రమార్క అన్నారు. ఎదిగే వయసులో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యవంతమైన మానవ వనరుగా ఎదుగుతారని, అందుకే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు చిన్ననాటి నుంచే నాణ్యమైన ఆహారం అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని చెప్పారు.

# కౌటాలలో అరుదైన నక్షత్ర తాబేలు ప్రత్యక్షం

**కాకతీయ, ఆసిఫాబాద్:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో అరుదైన నక్షత్ర తాబేలు ప్రత్యక్షమైంది. స్థానిక సదాశివపేటకు చెందిన రాచకొండ సంతోష్ ఇంటి ఆవరణలోకి మంగళవారం ఉదయం తాబేలు రావడంతో చుట్టుపక్కల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీపుపై నక్షత్రాల ఆకారాలు ఉండటంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. సమాచారం అందుకున్న ఇంటి యజమాని సంతోష్ వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తులసీదాస్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని తాబేలును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానిని సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తులసీదాస్ నాయక్ మాట్లాడుతూ వన్యప్రాణులు, ఇతర జంతువులు జనావాసాల్లోకి వచ్చినప్పుడు ప్రజలు వాటికి ఎలాంటి హాని చేయవద్దని సూచించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమయస్ఫూర్తితో సమాచారం అందించిన రాచకొండ సంతోష్‌ను అధికారులు అభినందించారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

**కాకతీయ, హైదరాబాద్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాహుల్‌గాంధీ, ఇండీ కూటమి నేతలు ప్రజల్లో తప్పుడు సమాచారం, అపోహలు వ్యాప్తి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. ఫారమ్-6, ఫారమ్-7లను ఏదో భూతంలా చూపిస్తూ ఓట్లు తొలగిస్తున్నారంటూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఫారమ్-6 కొత్త ఓటరుగా నమోదుకు ఉపయోగించే ప్రక్రియ మాత్రమేనని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారమ్-6, ఫారమ్-7కు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని రాంచందర్‌రావు తెలిపారు. ఫారమ్-7 ద్వారా ఓటర్ల జాబితాలోని పేర్లపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనలు చేయవచ్చని, అయితే దానితోనే ఓటు ఆటోమేటిక్‌గా తొలగిపోదని పేర్కొన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపునకు నిర్దేశిత పరిశీలన, విచారణ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల సంఘం నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు.

**ఎస్ఐఆర్ ఏకగ్రీవ నిర్ణయమే**

ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న ప్రచారం అవాస్తవమని రాంచందర్‌రావు అన్నారు. 2025 జూన్ 24న బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిర్ణయంతోనే ప్రారంభమైందని పేర్కొన్నారు. బిహార్ ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘం అధికార పరిధిని సుప్రీంకోర్టు 2026 మే 27న పరిశీలించిన విషయం కూడా ఉందన్నారు. చనిపోయినవారి పేర్లు, డూప్లికేట్, బోగస్ ఓట్లను జాబితాల నుంచి తొలగించాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ భావిస్తుందా? అని రాంచందర్‌రావు ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ నేతలే నకిలీ, బోగస్, డూప్లికేట్ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. తెలంగాణలో 2018లో అవకతవకలపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఇప్పుడు ఓటరు జాబితా శుద్ధీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. పెద్ద సంఖ్యలో ఓట్లు అక్రమంగా తొలగించారన్న కాంగ్రెస్ నేతల ఆరోపణలకు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు.

**గెలిస్తే ఈసీ మంచిదా.. ఓడితే నిందలా?**

కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎన్నికల సంఘాన్ని ప్రశంసించి, ఓడిపోయినప్పుడు అదే సంస్థతో పాటు ఈవీఎంలపై ఆరోపణలు చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని రాంచందర్‌రావు విమర్శించారు. 1952 నుంచి 2014 వరకు పలు దఫాలు ఎస్ఐఆర్ జరిగిందని, అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని గుర్తుచేశారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణను రాజకీయ కుట్రగా చిత్రీకరించడం మానేసి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



# మంచు కింద విశ్వ రహస్యాలు

(మొదటిపేజీ తరువాయి)

విశ్వ కణాలు. ద్రవ్యరాశి చాలా తక్కువగా ఉండటంతోపాటు విద్యుదావేశం లేకపోవడం, ఇతర రేణువులతో అరుదుగా మాత్రమే ఢీకొనడం వల్ల వీటిని గుర్తించడం అత్యంత క్లిష్టం. సూర్యుడి వంటి నక్షత్రాల నుంచి వెలువడే న్యూట్రినోలు ప్రతి సెకనుకు లక్షల కోట్ల సంఖ్యలో మన శరీరాల గుండా దూసుకుపోతుంటాయి. న్యూట్రినోలను గుర్తించేందుకు దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచును ఉపయోగించవచ్చని హాల్జెన్ గుర్తించారు. మంచులో ఏర్పాటు చేసిన కాంతి సెన్సార్ల సాయంతో న్యూట్రినోల కదలికలను గుర్తించే ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారు. విశ్వంలోని అత్యంత శక్తివంతమైన న్యూట్రినోల మూలాలను అన్వేషించేందుకు ఈ పరిశోధన కొత్త మార్గాలను తెరిచింది. అంతర్జాతీయ పరిశోధకులు, ఇంజినీర్ల సమన్వయంతో సాగిన ఈ ప్రయోగం ఖగోళ శాస్త్ర పరిశోధనల్లో కీలక మలుపుగా నిలిచింది.

**నోబెల్ ప్రకటనల పరంపర**

ఇప్పటికే ఈ ఏడాది వైద్యశాస్త్ర నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు. కాంతి ద్వారా జీవకణాల్లోని అయాన్ ఛానెళ్లను నియంత్రించే పద్ధతులు, నాడీ వ్యవస్థ కణాల పనితీరుపై పరిశోధనలకు గాను అమెరికాకు చెందిన కార్ల్ డిసెరోథ్, జర్మనీకి చెందిన పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌లను విజేతలుగా ప్రకటించారు. ఆప్టోజెనెటిక్స్ రంగంలో వారి పరిశోధనలకు ఈ గౌరవం దక్కింది. బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య నోబెల్, శుక్రవారం శాంతి నోబెల్ విజేతలను ప్రకటించనున్నారు. అక్టోబర్ 12న ఆర్థికశాస్త్ర నోబెల్ విజేతను వెల్లడించనున్నారు.

**ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం**

స్వీడన్‌కు చెందిన రసాయన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం ఏటా డిసెంబర్ 10న నోబెల్ పురస్కారాలను అందజేస్తారు. మానవాళికి గొప్ప ప్రయోజనం చేకూర్చిన వారికి తన సంపదతో పురస్కారాలు అందించాలని నోబెల్ తన వీలునామాలో పేర్కొన్నారు. ఆయన మరణానంతరం నోబెల్ ఫౌండేషన్ ఏర్పాటైంది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన శాస్త్రవేత్తలు, రచయితలు, శాంతి కార్యకర్తలను ఎంపిక చేసి ఈ పురస్కారాలు అందిస్తున్నారు.

# తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

**కాకతీయ, తిరుమల:** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు, పెరటాసి మాసం చివరి వారం నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్, ప్రివిలేజ్డ్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, డిఫెన్స్ దర్శనాలను కూడా ఈ కాలంలో రద్దు చేసినట్లు తెలిపింది. అక్టోబర్ 10 నుంచి 19వ తేదీ వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలను స్వీకరించబోమని పేర్కొంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 12, 13, 14, 18, 19, 20వ తేదీలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను అక్టోబర్ 7న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తులు టికెట్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని సూచించింది. భక్తుల రద్దీని నియంత్రించి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

# రేవంత్, కేసీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆరోపణలపై న్యాయ విచారణ అవసరం
- ఎన్నికల అఫిడవిట్లలోని ఆస్తులతోపాటు అదనపు ఆస్తులపైనా దర్యాప్తు చేయాలి
- ప్రజలకు వాస్తవాలు తెలియాలి
- పరస్పర ఆరోపణల నిజానిజాలు నిగ్గు తేల్చాలి
- బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- ఆస్తులపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన ఆస్తులపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆస్తుల ఆరోపణల్లో నిజానిజాలను న్యాయ విచారణ ద్వారా వెలికితీయాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదును ప్రజాప్రయోజన వ్యాజ్యంగా లేదా విచారణకు తగిన ఇతర రూపంలో స్వీకరించాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. అక్టోబర్ 2న తాను చేసిన ప్రకటనకు అనుగుణంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు అందజేశానని రఘునందన్‌రావు తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరు చేస్తున్న ఆరోపణలకు సంబంధించిన పత్రికా కథనాలు, ఇతర వివరాలను సేకరించి, అవసరమైన పత్రాలను ఫిర్యాదుకు జతచేసినట్లు చెప్పారు. పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నప్పటికీ వాటిపై స్వతంత్రంగా న్యాయపరమైన విచారణ కోరేందుకు ఇరు పార్టీల నేతలు ఎవరూ ముందుకు రావడం లేదని అన్నారు. అందుకే తానే నేరుగా హైకోర్టును ఆశ్రయించినట్లు వివరించారు.

**ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరగాలి**

కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారని రఘునందన్‌రావు పేర్కొన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ బీఆర్ఎస్ నేతలు ప్రతివిమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఇరు పార్టీల నేతలు చేస్తున్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యవహారంలో బీజేపీ కూడా ప్రశ్నలు లేవనెత్తుతోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల రూపాయలు దోచుకుందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారని రఘునందన్‌రావు తెలిపారు. అదే సమయంలో గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.50 వేల కోట్లు సంపాదించారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారని చెప్పారు. ఈ రెండు వర్గాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం ఎంత, అవాస్తవం ఎంత అనేది సమగ్ర విచారణ ద్వారా తేల్చాలని కోరారు. రాజకీయ వేదికలపై పరస్పరం ఆరోపణలు చేసుకోవడం కాకుండా వాటికి ఆధారాలను న్యాయస్థానం ముందు ఉంచాల్సిన అవసరం ఉందన్నారు.

**అఫిడవిట్లకు మించి ఆస్తులున్నాయా?**

రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులను పరిశీలించాలని రఘునందన్‌రావు కోరారు. ఆస్తుల వివరాలతోపాటు అఫిడవిట్లలో పేర్కొన్న వాటికి మించి ఇతర ఆస్తులు ఉన్నాయా అనే అంశాన్ని కూడా విచారణలో పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు నిజమా కాదా అన్నది న్యాయ విచారణ ద్వారానే తేలాలని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆస్తుల వ్యవహారంపై రాజకీయ ఆరోపణలకు ముగింపు పలికి, సమగ్ర విచారణ ద్వారా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రఘునందన్‌రావు కోరారు.

# 10న భూదోపిడీ బయటపెడుతాం

(మొదటిపేజీ తరువాయి)

ఒక శాతం మాత్రమేనని అన్నారు. లక్షల ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూముల అన్యాక్రాంతంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన దోపిడీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీపై బీజేపీ మొదటి నుంచీ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. అసెంబ్లీలో మంత్రులు, విప్‌లు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు అడ్డుకున్నా, మైకులు కట్ చేసినా ప్రజా సమస్యలపై తమ గళం వినిపించామని తెలిపారు. నిషేధిత జాబితా ఇరవై రెండో ఏ, ధరణి, భూభారతి పేర్లతో సాగిన భూ వ్యవహారాలను ఆధారాలతో ప్రశ్నించడంతో ప్రభుత్వం సమాధానం చెప్పుకోలేక పోయిందని విమర్శించారు.

**ఫోరెన్సిక్ నివేదిక ఎక్కడ?**

ధరణిపై చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడీ బయటపడితే తమ ప్రభుత్వ భూదోపిడీ కూడా వెలుగులోకి వస్తుందనే భయంతోనే నివేదికను తొక్కిపెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి కుటుంబ ఆస్తుల చిట్టాను బయటపెడితే, ముఖ్యమంత్రి కేటీఆర్ ఆస్తుల చిట్టాను బయటపెట్టారని, పరస్పరం బయటపెట్టుకున్నది అసలు దోపిడీలో కేవలం ఒక శాతం మాత్రమేనని అన్నారు. ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. కొన్ని కాలనీలు, భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ చిన్నచిన్న మెమోలు జారీ చేసి సమస్య పరిష్కరించామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. చట్టబద్ధమైన అనుమతులు ఉన్న ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చడమే తప్పని పేర్కొన్నారు. నాలుగు కాలనీలకు మెమోలు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా, లక్షల ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల భూ కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించి, అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని బాధితులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**రూ.50 వేల కోట్ల భూమిపై కబ్జా యత్నం**

కూకట్‌పల్లి సర్వే నంబర్ 1007లో రూ.50 వేల కోట్ల విలువైన భూమిని కాజేయడానికి అధికార పార్టీకి చెందిన బినామీ కంపెనీ ప్రహరీ గోడ నిర్మించేందుకు ప్రయత్నించిందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. 1961లో ఏర్పాటైన సొసైటీకి చెందిన భూముల్లో 1400 కుటుంబాల ప్లాట్లు, కాంపౌండ్ వాల్స్‌ను జేసీబీలతో కూల్చివేశారని అన్నారు. ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి బాధితుల సమస్యలు తెలుసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ భూములతోపాటు చట్టబద్ధమైన ప్రైవేటు ఆస్తులపైనా కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల దోపిడీపై బాధితుల నుంచి వందలాది ఫోన్‌కాల్స్, పక్కా ఆధారాలు బీజేపీకి అందుతున్నాయని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల భూ వ్యవహారాలపై ఇప్పటికే 200 కేస్ స్టడీలను సేకరించి నివేదిక సిద్ధం చేశామని వెల్లడించారు. అసెంబ్లీలో మైకులు కట్ చేసినా ప్రజాక్షేత్రంలో ఆధారాలతో దోపిడీని ఎండగడతామని స్పష్టం చేశారు.

**పదో తేదీన తొలి విడత ఆధారాలు**

ఈ నెల పదో తేదీన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమక్షంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తొలి విడతగా 10 నుంచి 15 కీలక కేస్ స్టడీలను, డాక్యుమెంటరీ ఆధారాలను బయటపెడతామని ప్రకటించారు. అనంతరం రెండో విడత ప్రజెంటేషన్ కూడా విడుదల చేస్తామన్నారు. నిషేధిత జాబితా ఇరవై రెండో ఏ, ధరణి, భూభారతి ద్వారా భూదోపిడీ ఎలా సాగిందో ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని, అదే వేదికగా భూదోపిడీపై బీజేపీ భవిష్యత్ ప్రజా పోరాట కార్యాచరణను వెల్లడిస్తామని మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు.

# 12న ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వర ఆలయానికి భూమి పూజ

**చిన్నజీయర్ స్వామీజీని ఆహ్వానించిన మంత్రి తుమ్మల**



**కాకతీయ, ఖమ్మం:** ఖమ్మం పట్టణంలో నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీ వెంకటేశ్వర దివ్యక్షేత్ర శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు త్రిదండి శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామీజీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామీజీని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి తుమ్మల పాదాభివందనం చేసి దివ్యాశీస్సులు అందుకున్నారు. ఈ నెల 12న ఖమ్మం పట్టణంలో నిర్వహించనున్న శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమం శ్రీ చిన్నజీయర్ స్వామీజీ అమృతహస్తాల మీదుగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామీజీ దివ్యాశీస్సులతో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# ఏజెన్సీకి న్యాయ సేవలు విస్తరించాలి

**కాకతీయ, ఏటూరునాగారం రూరల్:** ఏజెన్సీ ప్రాంత ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయాలని, ఏటూరునాగారంలో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కోర్టును ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ములుగు జిల్లాలోని పది మండలాలకు న్యాయ సేవలు సమానంగా అందాల్సి ఉన్నప్పటికీ ఏటూరునాగారం పరిసర ఏజెన్సీ మండలాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు పరిమితంగానే అందుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో ఒక్కసారి మాత్రమే న్యాయ సేవలు అందినట్లు చెబుతున్నారు. దీంతో న్యాయ సహాయం అవసరమైన గిరిజనులు, పేదలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటూరునాగారంలో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కోర్టు ఏర్పాటు చేస్తే ఏజెన్సీ ప్రజలకు న్యాయ వ్యవస్థ మరింత చేరువ అవుతుందని పేర్కొంటున్నారు. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి, వెంకటాపురం, వాజేడు తదితర మారుమూల మండలాల ప్రజలు న్యాయ సేవల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితిని నివారించాలని కోరుతున్నారు. సత్వర న్యాయం, ఉచిత న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మానాలకు మహర్దశ

- **మూడు కీలక రహదారులకు రూ.14.20 కోట్లతో శంకుస్థాపన**
- **మానాల ప్రధాన రహదారి నాలుగు వరుసలుగా విస్తరణ**
- **సూరమ్మ చెరువు నుంచి ఎత్తిపోతలతో సాగు, తాగునీరు**
- **మరిమడ్ల రహదారికి రూ.7.43 కోట్లు, హనుమాన్ తండాకు రూ.1.17 కోట్లు**
- **మానాల ప్రజల చిరకాల నీటి సమస్యకు పరిష్కారం చూపుతాం : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి**



**కాకతీయ, రుద్రంగి:** మానాల ప్రజల చిరకాల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కలిగోట సూరమ్మ చెరువు పనులు తుది దశకు చేరుకున్నాయని, జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా మానాలకు సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రహదారి పనులను త్వరగా ప్రారంభించి వేగంగా పూర్తిచేస్తామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో మంగళవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు, మాజీ యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డితో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు. మానాల గ్రామానికి కీలకమైన మూడు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.14.20 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో మరిమడ్ల రహదారి నిర్మాణానికి రూ.7.43 కోట్లు, మానాల ప్రధాన రహదారిని రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించేందుకు రూ.5.60 కోట్లు, హనుమాన్ తండా గొర్రెగుండం రహదారి నిర్మాణానికి రూ.1.17 కోట్లు కేటాయించారు. పనులు పూర్తయితే గ్రామానికి రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

**సూరమ్మ చెరువు నుంచి నీరు**

కలిగోట సూరమ్మ చెరువు పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ఎత్తిపోతల పథకం ద్వారా మానాలకు సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మానాల ప్రజలు చాలాకాలంగా ఎదుర్కొంటున్న నీటి సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పారు. రహదారి నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ మానాల గ్రామానికి ప్రత్యేకమైన ఉద్యమాల చరిత్ర ఉందన్నారు. ప్రజా పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, రైతుబంధు, రుణమాఫీతోపాటు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తనకు ఘన స్వాగతం పలికిన మానాల గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**మానాల పేరే ఇంటిపేరుగా**

మాజీ నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు, మాజీ యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మానాల గ్రామం పేరునే తన ఇంటిపేరుగా పెట్టుకుని ప్రజల ఆదరాభిమానాలతో ఎదిగానని భావోద్వేగానికి గురయ్యారు. గ్రామ ప్రజల ప్రేమ, ప్రోత్సాహమే తన ఎదుగుదలకు కారణమని పేర్కొంటూ కంటతడి పెట్టారు. గిరిజనులకు పోడు పట్టాల పునరుద్ధరణతోపాటు సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సుదర్శన్‌రెడ్డిని కోరారు. రానున్న రోజుల్లో బాల్కొండ వర్గానికి ప్రాతినిధ్యం వహించాలన్న తన మనసులో మాటను ప్రజల ముందుంచారు. సూరమ్మ చెరువు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా మానాలకు నీటిని అందించాలన్న విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినందుకు మానాల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర శంకర్‌గౌడ్, ఉప సర్పంచ్ దాసరి అశోక్, ఉర్దూ అకాడమీ కార్పొరేషన్ చైర్మన్ తాహెర్ బిన్ హైమద్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నటరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, చందుర్తి సీఐ రవీందర్, ఎస్సై మోతీరామ్ నాయక్, రిటైర్డ్ ఏడీఈ భూక్య లక్ష్మణ్, తూమ్ జలపతి, కొమ్ముల రవీందర్, విడీసీ చైర్మన్ జక్కుల శ్రీనివాస్, జక్కు మోహన్, లక్కాకుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాంక్రీట్‌తో రాజన్న గుడి నిర్మాణమా?

**కాకతీయ,తెలంగాణ బ్యూరో/ వేములవాడ :** ఎములాడ రాజన్న ఆలయాన్ని కాంక్రీట్‌తో నిర్మిస్తూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. రాజన్న ఆలయాన్ని కృష్ణశిలతో ఆగమ శాస్త్రం, ఆచారాల ప్రకారం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణం ఆలస్యమైనా ఫర్వాలేదని, వెయ్యేళ్లు నిలిచేలా కృష్ణశిలతో నిర్మించాలన్నారు. రాజన్న ఆలయానికి నిధుల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. సిరిసిల్ల జిల్లా ఏర్పడిన తర్వాత కూడా నీటిపారుదల, విద్య, వైద్యం, రహదారులు, మౌలిక వసతుల విషయంలో ప్రజలకు పూర్తిస్థాయి ప్రయోజనం దక్కలేదని పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. వేములవాడ రాజన్న ఆలయానికి చోళులకంటే ముందునుంచే గొప్ప చరిత్ర ఉందని కవిత తెలిపారు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు తన భార్య జాంబవతికి సంతానం కోసం ఇక్కడ కోడె మొక్కులు చెల్లించారనే విశ్వాసంతోనే కోడె మొక్కుల సంప్రదాయం ప్రారంభమైందన్నారు. తమ పార్టీకి, తమ పిల్లలకు రాజన్న ఆశీస్సులు ఉండాలని తాము కూడా కోడెలు కట్టేశామని చెప్పారు. వేములవాడలో కోడెను కట్టేసే సంప్రదాయాన్ని కొంగు బంగారంగా భావిస్తారని, అలాంటి ఆలయంలో కోడెలు సరైన పశుగ్రాసం లేక చనిపోవడం బాధాకరమన్నారు. కోడెలు చనిపోయినప్పుడు శాస్త్ర ప్రకారం అంత్యక్రియలు కూడా చేయడం లేదని విమర్శించారు. హిందూత్వం గురించి మాట్లాడే స్థానిక ఎంపీ బండి సంజయ్ వేములవాడలో కోడెలు చనిపోతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వాటికి మంచి పశుగ్రాసం అందించి సంరక్షించాలని కోరారు.

**కాంక్రీట్ నిర్మాణంపై అభ్యంతరం**

రాజన్న ఆలయానికి రూ.250 కోట్లు తామిచ్చామంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పరం విమర్శలు చేసుకుంటూ నిధుల అంశాన్ని రాజకీయంగా మార్చాయని కవిత అన్నారు. కృష్ణశిల అందుబాటులో ఉన్నప్పటికీ, ఆగమ శాస్త్రం తెలిసినవారు ఉన్నప్పటికీ కాంక్రీట్‌తో ఆలయాన్ని ఎందుకు నిర్మిస్తున్నారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణం ఆలస్యమైనా కృష్ణశిలతో శాశ్వతంగా నిలిచేలా నిర్మించాలని కోరారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ ప్రసాద్ పథకంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ ఆలయాన్ని ఎందుకు చేర్చలేదో సమాధానం చెప్పాలని, రాజన్న ఆలయానికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా తీసుకొచ్చారా అనే విషయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. వేములవాడలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, ఎక్కడ చూసినా దుమ్ము కనిపిస్తోందని కవిత విమర్శించారు. రూ.5 కోట్లతో నిర్మించిన ఒక మార్కెట్ వృథాగా ఉందని, మరో మార్కెట్‌ను సగం నిర్మించి వదిలేశారని అన్నారు. దీంతో కూరగాయలు, పండ్ల వ్యాపారులు దుమ్ములోనే విక్రయాలు చేస్తూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రుద్రమ చెరువు తీవ్ర దుర్గంధంతో అపరిశుభ్రంగా మారిందని, చెరువులను బాగు చేయాల్సిన హైడ్రా పేదల ఇళ్లను కూల్చడమే పనిగా పెట్టుకోవద్దని అన్నారు. వేములవాడలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, రోడ్లు ఇరుకుగా ఉన్నాయని చెప్పారు. తన తల్లిదండ్రుల వివాహం కూడా ఇక్కడే జరిగిందని, ఈ ప్రాంతంతో తమకు ఎంతో అనుబంధం ఉందన్నారు. ముఖ్యంగా వేములవాడలో అండర్ డ్రైనేజీ అవసరముందని, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దానిపై దృష్టి పెట్టాలని కోరారు. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో సిరిసిల్లకు ఎక్కువ ప్రాధాన్యం లభించిందని, ఇప్పుడు ఆది శ్రీనివాస్ విప్‌గా ఉండి వేములవాడకు ఎక్కువ చేస్తూ సిరిసిల్లను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నేత, చేనేత కార్మికులు అధికంగా ఉన్న సిరిసిల్లలో కాకుండా వేములవాడలో యారన్ డిపో ఏర్పాటు చేయడం, అధికార దర్పం ప్రదర్శించేందుకు ప్రజలను ఇబ్బంది పెట్టడమేనన్నారు.

**కాళేశ్వరం నీళ్లు.. ఎక్కడి వరకు**

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాలకు ప్రయోజనం కలగాలని, కానీ ఇప్పటి వరకు ఒక్క ఎకరాకు కూడా నీరు రాలేదని కవిత అన్నారు. పనులన్నీ పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. 2018 మేలో అప్పటి నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు వచ్చి 4 నెలల్లో రుద్రంగి రిజర్వాయర్ పూర్తి చేస్తామని చెప్పినా, పదేళ్లు గడిచినా అది పూర్తికాలేదన్నారు. రిజర్వాయర్ పూర్తయితే దాదాపు 63 వేల ఎకరాలకు కాలువల ద్వారా నీరు అందించవచ్చని చెప్పారు. దూమ్‌పేట్ వద్ద రిజర్వాయర్ నిర్మించి నీటిని లిఫ్ట్ చేస్తే కథలాపూర్, మేడిపల్లి ప్రాంతాలకు నీరు అందుతుందని, ఎర్రకుంట, పటేళ్ల చెరువులను కలిపి రిజర్వాయర్ నిర్మిస్తే వేములవాడ, చందుర్తి, కోనరావుపేట మండలాలకు నీరు ఇవ్వవచ్చని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లుగా ఈ అంశాలను పట్టించుకోవడం లేదని, ఇకనైనా దృష్టి పెట్టాలని కోరారు. అప్పర్ మానేరు-మిడ్ మానేరు లింక్ పూర్తి చేస్తే 1.10 లక్షల ఎకరాలకు నీరు అందించవచ్చని చెప్పారు. సిరిసిల్ల ప్రజల దశాబ్దాల రైల్వే లైన్ కలను సాకారం చేయాలని, పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారి పనులను కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

**రైతులకు నవంబర్ వరకు కరెంట్ ఇవ్వాలి**

వర్షాలు లేక రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నందున నవంబర్ వరకు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం కరెంట్ కొనుక్కొస్తుందో, అడుక్కొస్తుందో కానీ రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వకుండా ఉండొద్దని హెచ్చరించారు. ఈ విషయంలో పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై పోరాడాలని కోరారు. సిరిసిల్లలో ఇటీవల ముఖ్యమంత్రి నిర్వహించిన సభలో తిట్లు, విమర్శలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. సిరిసిల్ల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేను గెలిపిస్తే మంత్రిని చేసి అభివృద్ధి చేస్తామని చెప్పడాన్ని ప్రశ్నిస్తూ.. గత పదేళ్లుగా సిరిసిల్లకు మంత్రి లేరా, ఆయన ఉన్నప్పుడు నీళ్లు ఎందుకు రాలేదని నిలదీశారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి స్వయంగా సిరిసిల్లకు మంచి చేయవచ్చని, అందుకు మళ్లీ మంత్రిని గెలిపించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

**గల్ఫ్ బాధితులకు రూ.5 లక్షల సాయం**

గల్ఫ్ కార్మికుల కోసం గత ప్రభుత్వం ఏమీ చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం అడ్వైజరీ కమిటీ వేసినా ఆ కమిటీ నిర్ణయాలను చూసి అందులోని సభ్యులే రాజీనామా చేశారని కవిత అన్నారు. ఇప్పటి వరకు 112 మంది గల్ఫ్ కార్మికులు చనిపోయారని, వారి కుటుంబాలకు తక్షణమే రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లకు జేఎన్‌టీయూ కాలేజీ తెచ్చామని, డిగ్రీ కాలేజీ పేరు మార్చి అక్కడే పెట్టారని పేర్కొన్నారు. యువ సామ్రాట్‌గా చెప్పుకునే కేటీఆర్ నియోజకవర్గంలోని జేఎన్‌టీయూ కాలేజీలో ల్యాబ్ కోసం జగిత్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. హాస్టళ్లు, ల్యాబ్‌లు లేకపోతే జేఎన్‌టీయూ కాలేజీ ఏర్పాటు చేసిన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలో ఒక్క గదిలో 16 మంది ఉంటున్నారని, 140 మందికి ఒక్క వాటర్ ఫిల్టర్ మాత్రమే ఉందని తెలిపారు. విద్యార్థుల కోసం మరో హాస్టల్ తీసుకుని కాలేజీకి దగ్గరగా ఏర్పాటు చేయాలని, మెడికోలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కేటీఆర్, బండి సంజయ్, ఆది శ్రీనివాస్ కృషి చేయాలని కోరారు. ఈ ప్రాంతానికి 15 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి మంజూరైనా ఇప్పటికీ పూర్తి కాలేదని, దీనిపై స్థానిక ఎంపీ దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

**సెస్ రూ.32 కోట్ల వ్యవహారంపై విచారణ**

సిరిసిల్లలోని సెస్ సహకార విద్యుత్ రంగంలో చరిత్ర సృష్టించిన సంస్థ అని కవిత అన్నారు. అలాంటి సంస్థను రద్దు చేసి ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేశారని, సెస్ ఉన్న సమయంలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందేవని, ఇప్పుడు వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో సెస్‌లో రూ.32 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు జరిగిన అగ్నిప్రమాదంలో సంబంధిత ఫైళ్లు కాలిపోయాయని, పలు చోట్ల ఆధారాలు మాయం చేసేలా అగ్నిప్రమాదాలు జరిగాయని విమర్శించారు. నేరెళ్ల బాధితులకు సంబంధించిన ఆధారాలు కూడా మాయం చేశారని ఆరోపిస్తూ.. సెస్‌లో జరిగిన రూ.32 కోట్ల వ్యవహారంపై కచ్చితంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల బాధితుల పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వారిని మళ్లీ మోసం చేశారని కవిత విమర్శించారు. ఇటీవల సిరిసిల్లలో జరిగిన సభకు బాధితులను గ్రూపులుగా విడగొట్టి కొందరికి రూ.5 లక్షలు, మరికొందరికి రూ.10 లక్షల చెక్కులు ఇచ్చారని, ఇంత దూరం వచ్చి బాధితులకు అంతమాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. బాధితులకు కోటి రూపాయల పరిహారం, 3 ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల ఘటనకు సంబంధించి బాధితులు అనడానికి ఆధారాలు లేవని చెబుతున్నారంటూ.. అప్పటి జైలర్ నివేదికలు, అప్పటి డీఐజీ బాధితులను ఇంటర్వ్యూ చేసిన నివేదికలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా బాధితులకు న్యాయం ఎలా జరుగుతుందని నిలదీశారు. నేరెళ్ల ఘటనపై శ్వేతపత్రం విడుదల చేయాలని సిరిసిల్ల ఎస్పీని డిమాండ్ చేశారు. తమ పార్టీ తరఫున కూడా బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తామని, ముఖ్యమంత్రి సభ అనంతరం బాధితులు తనను కలిసి తమను మోసం చేసి సభకు తీసుకెళ్లారని చెప్పారని తెలిపారు. సామాజిక న్యాయం కోసం పోరాడే పార్టీగా నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదన్నారు.

**రేవంత్–మహేష్‌గౌడ్‌ది ఇడుపు కాయితం జోడీ**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ తమది వైఎస్, డీఎస్ జోడీ అని చెప్పుకుంటున్నారని కవిత వ్యాఖ్యానించారు. అయితే వారి మాటలు, వ్యవహారశైలి చూస్తుంటే అది ఇడుపు కాయితం జోడీలా కనిపిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఒకటి మాట్లాడుతుంటే పీసీసీ అధ్యక్షుడు మరోటి మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రతి అంశంపైనా కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. జర్నలిస్టులకు ఇళ్లు ఇవ్వడం లేదని, ఉర్దూ జర్నలిస్టులకు మండలానికి ఒక్కటే అక్రిడిటేషన్ ఇస్తున్నారనే సమస్య ఉందని పేర్కొన్నారు. ముస్లింలు, ఉర్దూ భాష పట్ల ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన పేరు రేవంతుద్దీన్ అని చెప్పుకుంటారని, కానీ ఆయనను అబద్ధాలుద్దీన్ అనాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల జిల్లా ఏర్పడినప్పటికీ నీటిపారుదల రంగంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే కొనసాగుతున్నాయని కవిత అన్నారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో గతంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని పేర్కొంటూ.. మాజీ మావోయిస్టులంతా ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ కూడా వారి సిద్ధాంతాలతోనే పనిచేస్తోందని, టీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ప్రజా ఉద్యమాలకు ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మాజీ మావోయిస్టులకు గతంలో అనేక హామీలు ఇచ్చినా ఏ పార్టీ కూడా వాటిని నెరవేర్చలేదని అన్నారు.

**విద్య, వైద్యానికి పాంచజన్యంలో ప్రాధాన్యం**

మెరుగైన ఉచిత విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ అందాలన్నదే తమ లక్ష్యమని కవిత చెప్పారు. తమ పార్టీ ప్రకటించిన పాంచజన్యంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చామని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేస్తామని తెలిపారు. అప్పటి వరకు ప్రస్తుత ప్రభుత్వాలపై వాటిని అమలు చేయాలని పోరాడతామన్నారు. ఇప్పటికే ఆపరేషన్ బ్లూ కోడ్ పేరుతో పార్టీ నేతలు అన్ని ఆస్పత్రుల్లో పరిస్థితులను పరిశీలిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రులపైనా నియంత్రణ ఉండాలని, రూ.5 సైలెన్‌ను రూ.300కు విక్రయించే పరిస్థితులు ఉన్నాయని, ఇది ప్రజలను దోపిడీ చేయడమేనని విమర్శించారు. ప్రతి ఊరిలో బడి, ప్రతి తరగతికి టీచర్ ఉండాలన్నది తమ నినాదమన్నారు. చిన్న ప్రైవేట్ పాఠశాలలతో ఇబ్బంది లేదని, కార్పొరేట్ విద్య పేరుతో ప్రజలను దోచుకునే సంస్థలతోనే సమస్య ఉందన్నారు. తాను నిజామాబాద్ ఎంపీగా ఉన్నప్పుడు నారాయణ, చైతన్య విద్యాసంస్థలను అక్కడికి రానివ్వలేదని, విద్య పేరుతో దోపిడీ సరికాదనే ఉద్దేశంతోనే ఆ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. తమిళనాడు తరహాలో తెలంగాణలోనూ విద్యా కమిషన్ ఏర్పాటు చేసి ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

**ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడతాం**

ప్రజా సమస్యలపై ప్రస్తుతం ఉన్న ప్రతిపక్షాలు సరిగా పోరాటం చేయడం లేదని కవిత విమర్శించారు. అందుకే తాము ప్రతిపక్షాల కంటే ఎక్కువగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామని చెప్పారు. ప్రశ్నించే వారు ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఆదిలాబాద్ రిమ్స్ ఘటన తర్వాత తమ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో వెంటనే రూ.11 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలకు దీటుగా ప్రజా సమస్యలపై పోరాడతామని స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

- **67 రోజుల తర్వాత జైలు నుంచి విడుదలకు మార్గం**
- **మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో నమోదైన కేసు**
- **షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన ఉప్పర్‌పల్లి కోర్టు**
- **అత్తాపూర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు**
- **ఆరోపణలు అవాస్తవమన్న ఉదయ్ కృష్ణారెడ్డి**



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిని లైంగికంగా వేధించారన్న కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి షరతులతో కూడిన బెయిల్ లభించింది. దాదాపు 67 రోజుల పాటు జైలులో ఉన్న ఆయనకు రంగారెడ్డి జిల్లా ఉప్పర్‌పల్లి కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి ఆయనను అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సమయంలో ఈ వ్యవహారం చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనను అరెస్టు చేసి ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపర్చగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**గదిలోకి లాక్కెళ్లి బెదిరించారని ఫిర్యాదు**

జూలై 8న ఉదయ్ కృష్ణారెడ్డి తనను బలవంతంగా ఆయన గదిలోకి లాక్కెళ్లి భయభ్రాంతులకు గురిచేసి ఫోన్ పాస్‌వర్డ్ తీసుకున్నారని మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. జూలై 9న మరోసారి తనను జుట్టు పట్టుకుని ఆయన గదిలోకి లాక్కెళ్లి మెడపై కత్తి పెట్టి బెదిరించారని ఆరోపించారు. తనతో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వ్యక్తిగత వీడియోలను చిత్రీకరించారని, వాటిని తన భర్తకు పంపి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై వచ్చిన ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పందించారు. తనపై వస్తున్న ఫిర్యాదులు, వదంతులు నిరాధారమైనవని, అవాస్తవాలని పేర్కొంటూ న్యాయం గెలుస్తుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బంధువుల ఇంటికి వెళ్లిన ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. బంధువులు వెంటనే ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు.

**సుదీర్ఘ రిమాండ్ అనంతరం బెయిల్**

కోర్టు రిమాండ్ విధించడంతో ఉదయ్ కృష్ణారెడ్డి చంచల్‌గూడ జైలులో ఉన్నారు. సుమారు 67 రోజుల పాటు జైలులో ఉన్న ఆయనకు తాజాగా ఉప్పర్‌పల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కేసులో తదుపరి న్యాయ ప్రక్రియ కొనసాగనుంది. కాగా, మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి చేసిన ఆరోపణలు, వాటిపై నమోదైన కేసు, ఉదయ్ కృష్ణారెడ్డి స్పందన తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

# రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

- **ముందే నిల్వ చేసుకోవాలని జిడబ్ల్యూఎంసి విజ్ఞప్తి**

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** పైప్ లైన్ లీకేజీ మరమ్మతుల కారణంగా రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం కలగనుందని జిడబ్ల్యూఎంసి సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్ ప్రకటించారు. మడికొండ రైల్వే ట్రాక్ సమీపంలో లీకేజీ మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో 60 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటిపి) నుండి బుధ, గురువారాల్లో నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో 4 నియోజకవర్గాల పరిధిలో నీటి సరఫరాపై ప్రభావం పడనుంది.

**ప్రభావిత ప్రాంతాలు:**

**పరకాల:** స్తంభంపల్లి, వసంతాపూర్, దుప్పకుంట, గాడెపల్లి, బొల్లికుంట

**వర్ధన్నపేట:** నక్కలపల్లి, ఆలీపూర్, జక్కలొద్ది, అమ్మవారిపేట, బట్టుపల్లి, కడిపికొండ, రాంపేట, కుమ్మరిగూడెం, అయోధ్యాపురం, తారాలపల్లి, మడికొండ, బాలాజీనగర్, దేవన్నపేట, ఎల్లాపూర్, మునిపల్లి

**ఘన్‌పూర్:** రాంపూర్, ఉనికిచర్ల, టేకులగూడెం

**వరంగల్ తూర్పు:** శివనగర్, పుప్పాల గుట్ట, చింతల్, ఫోర్ట్ వరంగల్, శంభునిపేట, రంగశాయిపేట, సుభాష్‌నగర్, కరీమాబాద్, పెరుకవాడ, మిల్స్ కాలనీ, బీరన్నకుంట మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, ప్రజలు రెండు రోజులకు సరిపడా నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని ఎస్ఈ రాజ్ కుమార్ సూచించారు.

## వైమానిక దళానికి
# కొత్త దళపతి

- **అక్టోబర్ 31న బాధ్యతలు చేపట్టనున్న అశుతోష్ దీక్షిత్**
- **అమర్ ప్రీత్ సింగ్ పదవీ విరమణతో కొత్త నియామకం**
- **దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా విమాన ప్రయాణ అనుభవం**
- **మిరాజ్–2000 నుంచి తేజస్ వరకు నడిపిన ఫైటర్ పైలట్**
- **నాలుగు దశాబ్దాల సేవకు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు**

**కాకతీయ, నేషనల్ డెస్క్ :** భారత వైమానిక దళానికి కొత్త అధిపతిగా ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా పనిచేస్తున్న ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనుండగా, అదే రోజు మధ్యాహ్నం అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించనున్నారు. వైమానిక దళానికి 29వ అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ హోదాలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవా అనుభవం ఉన్న అశుతోష్ దీక్షిత్ ఫైటర్ పైలట్. 1986 డిసెంబర్ 6న వైమానిక దళంలోని ఫైటర్ స్ట్రీమ్‌లో చేరిన ఆయన ప్రయోగాత్మక టెస్ట్ పైలట్, క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా సేవలందించారు. ఇప్పటివరకు 3,500 గంటలకు పైగా విమాన ప్రయాణ అనుభవాన్ని ఆయన సొంతం చేసుకున్నారు. మిరాజ్-2000, వివిధ మిగ్ వేరియంట్లు, జాగ్వార్, కిరణ్, హాక్, ఐఎల్-78, తేజస్ తదితర విమానాలను దీక్షిత్ నడిపారు. మిరాజ్-2000 స్క్వాడ్రన్‌తోపాటు పశ్చిమ రంగంలోని ఫ్రంట్‌లైన్ ఫైటర్ బేస్, దక్షిణ రంగంలోని ఫైటర్ ట్రైనింగ్ బేస్‌లకు కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తేజస్ సహా స్వదేశీ విమాన ప్రాజెక్టులు, వైమానిక దళ ఆధునికీకరణలోనూ ఆయనకు కీలక అనుభవం ఉంది.

**కీలక ఆపరేషన్లలో భాగస్వామ్యం**

ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, కోప్ ఇండియా, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక ఆపరేషన్లు, సైనిక విన్యాసాల్లో దీక్షిత్ పాల్గొన్నారు. కేంద్ర ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా, చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 2026 జూలైలో వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. వైమానిక దళానికి అందించిన సేవలకు గుర్తింపుగా అశుతోష్ దీక్షిత్‌కు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. 2006లో వాయుసేన పతకం, 2011లో విశిష్ట సేవా పతకం, 2023లో అతి విశిష్ట సేవా పతకం, 2026లో పరమ విశిష్ట సేవా పతకం ఆయనను వరించాయి. ఫైటర్ పైలట్‌గా సుదీర్ఘ అనుభవంతోపాటు ఆధునికీకరణ, స్వదేశీ విమాన ప్రాజెక్టులపై అవగాహన ఉన్న దీక్షిత్ వైమానిక దళానికి కొత్త అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు.



# ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

- విపక్షను తొలగించి గౌరవంగా జీవించేలా సహకరించాలి
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ

**కాకతీయ, హనుమకొండ :** సమాజంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై వివక్షను తొలగించి, వారికి గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ అన్నారు. మంగళవారం సుబేదారిలోని అసంత భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, మోడరన్ అవేర్‌నెస్ సొసైటీ, వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రైడ్ ప్లేస్ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రాన్స్‌జెండర్లపై వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ శాఖలు, ఇతర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అధికారులు, సమాజం సహకరించాలని కోరారు. నైపుణ్య శిక్షణ పొందుతూ స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. హక్కులకు భంగం కలిగినా, వేధింపులకు గురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయిస్తే న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.



**మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి**

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్, ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ ఇన్‌చార్జి ఓ. రమేష్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణకు ప్రైడ్ ప్లేస్ పని చేస్తోందన్నారు. ప్రేమ, ఉపాధి పేరుతో అక్రమ రవాణాకు పాల్పడితే పోలీసులను సంప్రదించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి కే. విశ్వజ మాట్లాడుతూ స్వయం ఉపాధికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ నాయకురాలు లైలా, ఎస్సైలు శ్రావణి, సుధాకర్, ఏఎస్సై భాగ్యలక్ష్మి, కానిస్టేబుల్ రామారావు, ఇక్బాల్ పాషా, అజయ్‌కుమార్, కె. రవి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్, గే, శివశక్తి కమ్యూనిటీలకు చెందిన సుమారు 160 మంది హాజరయ్యారు.

# కానిస్టేబుల్ దిలీప్‌ను పరామర్శించిన గండ్ర

**ఆరెపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు**



**కాకతీయ, హైదరాబాద్ :** ఆరెపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ దిలీప్‌ను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. డ్యూటీ ముగించుకుని హన్మకొండకు వెళ్తున్న సమయంలో దిలీప్ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి దిలీప్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను కోరారు. అనంతరం దిలీప్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. దిలీప్ గతంలో గండ్ర వెంకటరమణారెడ్డి వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహించినట్లు తెలిపారు.

# విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి

**బయ్యక్కపేట పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీఓ**



**కాకతీయ, ఏటూరునాగారం:** తాడ్వాయి మండలం బయ్యక్కపేటలోని గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన పీఓ వారి పుస్తకాలను పరిశీలించి చదువులో ప్రగతి, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం కంప్యూటర్ గది, వసతిగృహం తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతోపాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు బోధన, అభ్యసన ప్రగతి, హాజరు, పాఠశాల నిర్వహణపై నిరంతరం దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

# ఎస్ఐఆర్‌లో బీఎల్ఓల పాత్ర కీలకం

- పరకాల నియోజకవర్గం రాష్ట్రంలోనే తొలిస్థానంలో నిలిచింది
- సేవలను అభినందించిన అధికారులు : పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్న



**కాకతీయ, ఆత్మకూరు :** ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో బూత్ లెవల్ అధికారుల పాత్ర కీలకమని పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ ఎన్. జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పరకాల నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా ప్రక్రియను పూర్తి చేసిందని తెలిపారు. ప్రతి బూత్ లెవల్ అధికారి సమర్థంగా పనిచేసి ప్రక్రియ విజయవంతానికి కృషి చేశారని అభినందించారు. బీఎల్ఓలను ముందుండి నడిపించిన తహసీల్దార్ ఎన్. జగన్మోహన్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. రానున్న ఎమ్మెల్యే ఎన్నికల ప్రక్రియను కూడా సమర్థంగా నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. అనంతరం అన్ని గ్రామాలకు చెందిన బీఎల్ఓలను ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ ఎన్. జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో అదనపు తహసీల్దార్ మమత, మండల గిర్దావర్ హరీక, ఫారూఖ్, జీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరాకు ఏర్పాట్లు చేయాలి

**వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ**



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** బతుకమ్మ నవరాత్రులు, విజయదశమి ఉత్సవాలను వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉర్సు రంగలీల మైదానంలో జరిగిన ఏర్పాట్ల సమీక్షలో పోలీస్ కమిషనర్ శ్వేత, కలెక్టర్ డా సత్య శారద, బల్దియా కమిషనర్ టి వెంకన్న, ఉత్సవ కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరవుతారని, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, మొబైల్ టాయిలెట్ల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతిరోజూ కార్యక్రమం ముగిసిన వెంటనే వ్యర్థాలను తొలగించాలని, ప్రధాన రహదారుల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. విజయదశమి రోజున 5 నుండి 6 వేల మంది వస్తారని, భద్రత, ట్రాఫిక్, అగ్నిమాపక ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు. ఉత్సవాల్లో చిన్నారులు తప్పిపోకుండా తల్లిదండ్రుల ఫోన్ నంబర్‌తో కూడిన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ లాంటి ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. సౌండ్ నియంత్రణ నిబంధనలు పాటించాలని, హెల్ప్ క్యాంప్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ ట్రాఫిక్ డైవర్షన్, జామ్ నియంత్రణకు పోలీసు యంత్రాంగం సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, వై.వి.గణేష్, సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు గోపాల్, అధ్యక్షుడు సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులపై సివిల్ సప్లై అధికారుల దాడులు

**నిబంధనలు పాటించని మూడు మిల్లులు సీజ్**

**కాకతీయ, నల్లబెల్లి :** నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న రైస్ మిల్లులపై సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు మంగళవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి సంధ్యారాణి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మూడు రైస్ మిల్లులను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని శివశంకర, సాంబశివ తదితర రైస్ మిల్లుల్లో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మిల్లుల్లో నిల్వ ఉన్న బియ్యం బస్తాలతో పాటు స్టాక్ రిజిస్టర్లు, ఇతర సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. బియ్యం నాణ్యతను నిర్ధారించేందుకు నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. తనిఖీల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించని మూడు మిల్లులను గుర్తించి సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. నర్సంపేట డివిజన్ పరిధిలోని రైస్ మిల్లుల యజమానులు తప్పనిసరిగా సంబంధిత అనుమతులు, రెన్యూవల్స్‌ను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా లేదా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రైస్ మిల్లులను నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో నల్లబెల్లి ఆర్ఐ సంపత్, విలేజ్ అధికారులు, సివిల్ సప్లై శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ, పీసీ ఉద్యోగాలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులకు అవకాశం
- అక్టోబర్ 10 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా సంచాలకులు డాక్టర్ కె. జగన్‌మోహన్

**కాకతీయ, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో సబ్-ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు ప్రిలిమినరీ పరీక్ష వరకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ అధికారులు తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లి ఆర్టీసీ కాలనీలోని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించే శిక్షణకు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. స్టడీ సర్కిల్ నిబంధనలు, రిజర్వేషన్ రోస్టర్, రిజర్వేషన్ నిష్పత్తి, డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ హనుమకొండ జిల్లా అధికారి బి. నిర్మల, ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా సంచాలకులు డాక్టర్ కె. జగన్మోహన్ తెలిపారు. దరఖాస్తుతోపాటు ఎస్ఐ, పీసీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్ లేదా అక్నాలెడ్జ్‌మెంట్ ఫారం, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు, టీసీ, కులం, ఆదాయం, నివాస, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. అక్టోబర్ 6 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తులను స్టడీ సర్కిల్‌లో సమర్పించాలి. మరిన్ని వివరాలకు 9160606862 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

# బాహ్య మూల్యాంకనం సరికొత్త విధానం

- ఆరు, తొమ్మిదో తరగతి జవాబు పత్రాల పరిశీలన
- నిర్ణీత గడువులో మూల్యాంకనం పూర్తి చేయాలి
- ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు



**కాకతీయ, నెల్లికుదురు:** ఆరు, తొమ్మిదో తరగతి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 విద్యార్థుల జవాబు పత్రాల బాహ్య మూల్యాంకనం సరికొత్త విధానమని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి, ఏసీజీఈసీ మందుల శ్రీరాములు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు అన్నారు. మండల కేంద్రంలోని నెల్లికుదురు ప్రాథమిక పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బాహ్య మూల్యాంకన ప్రక్రియను మంగళవారం జిల్లా బృందం పరిశీలించింది. భాషా మూల్యాంకనానికి నియమించిన మూల్యాంకనకర్తల సంఖ్య, ఆరు, తొమ్మిదో తరగతుల విద్యార్థుల సంఖ్య, ఇప్పటివరకు పూర్తయిన సబ్జెక్టుల మూల్యాంకనం తదితర వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. మూల్యాంకన కేంద్రం ఇన్‌చార్జి నుంచి జవాబు పత్రాల పంపిణీ, మూల్యాంకనం అనంతరం మార్పులను నమోదు చేసే నిర్దిష్ట నమూనా తదితర వివరాలను సేకరించారు. షెడ్యూల్ ప్రకారం నిర్ణీత గడువులో మూల్యాంకనం పూర్తి చేయాలని, అనంతరం మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మూల్యాంకన కేంద్రం ఇన్‌చార్జి ఈ. కరుణాకర్, పి. పనీంద్ర, కేంద్ర ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, మూల్యాంకనకర్తలు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ మస్కపురి సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్ హెచ్. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్‌మిల్లుకు అనుమతులు రద్దు చేయాలి

- ఇళ్లకు ఆనుకుని మిల్లు నిర్మించొద్దంటూ గ్రామస్తుల ధర్నా
- కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని ఆందోళన



**కాకతీయ, ఇనుగుర్తి:** చిన్ననాగారం గ్రామంలో ఎర్రబెల్లిగూడెం రోడ్డుకు ఇళ్లకు ఆనుకుని నూతనంగా నిర్మిస్తున్న రైస్‌మిల్లుకు అనుమతులు ఇవ్వొద్దని, ఇప్పటికే ఏ శాఖ నుంచి అనుమతులు మంజూరై ఉంటే వాటిని రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం కేసముద్రం-నెల్లికుదురు ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న ఎస్సై నరేష్ అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడటంతో వారు గ్రామపంచాయతీకి వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రైస్‌మిల్లు నిర్మిస్తే శబ్ద, వాయు కాలుష్యంతోపాటు ధాన్యం రవాణా సమయంలో దుమ్ము, ధూళి సమస్యలు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు సమయంలో పెద్ద సంఖ్యలో లారీలు రావడంతో సింగిల్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. లారీలను నిలిపేందుకు కూడా స్థలం లేదన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికుల వల్ల గ్రామంలో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైస్‌మిల్లుకు అనుమతులు ఇవ్వొద్దని గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని, ఇప్పటికే అనుమతులు ఉంటే రద్దు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో గుడాల లక్ష్మారెడ్డి, ఆలకుంట్ల సోమయ్య, బైరు రమేష్, బొబ్బల దేవరాజు, గుగులోతు నీలమ్మ, గుగులోతు జానీ, గుగులోతు లక్ష్మీ, గుగులోతు వెంకన్న, గుగులోతు ఫుల్‌సింగ్, గుడాల మహిపాల్‌రెడ్డి, వడపల్లి కొండయ్య, కొయ్యడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో నీటి కోసం రాస్తారోకో

- నీళ్ల బిందెలతో హుస్నాబాద్–కరీంనగర్ రహదారి దిగ్బంధం
- ఫోర్‌లైన్ పనులతో పైపులు ధ్వంసం.. 10 రోజులుగా నీటి కష్టాలు
- పంచాయతీ కార్యదర్శి అమృత వర్షిణి హామీతో ఆందోళన విరమణ



**కాకతీయ, చిగురుమామిడి :** కొండాపూర్ గ్రామంలో 10 రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు మంగళవారం కొండాపూర్ స్టేజీ వద్ద హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఫోర్‌లైన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జేసీబీలతో తవ్వకాలు చేపట్టడంతో నల్లా పైపులు ధ్వంసమయ్యాయని గ్రామస్తులు ఆరోపించారు. ఖాళీ బిందెలను రోడ్డుపై ఉంచి మహిళలు ఆందోళనకు దిగడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. బస్సులు గంటల తరబడి నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న కొండాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి అమృత వర్షిణి ఆందోళన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు ట్రాక్టర్ల ద్వారా నీటిని తెప్పించి ఇంటింటికీ సరఫరా చేయించారు. పైప్‌లైన్ మరమ్మతులు కూడా వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు రాస్తారోకోను విరమించారు. కార్యదర్శి సత్వర స్పందనపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కాకతీయ, నెల్లికుదురు:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎదల్ల యాదవ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎదల్ల యాదవ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్‌కు మండల ప్రజల తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు వెంకన్న, ప్రశాంత్, భాస్కర్, ప్రభాకర్ గౌడ్, బాలాజీ నాయక్, గుట్టయ్య, వెంకన్న, సతీష్, నాగరాజు, యాకయ్య, కృష్ణ, రాజేష్, పూర్ణచందర్, వెంకటేష్, మధు, శ్రీను, యాకన్న, దేవేందర్, ప్రశాంత్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య, మౌలిక వసతులు కల్పించాలి

- విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య హామీ



**కాకతీయ, మెదక్, అక్టోబర్ 6:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలంగాణ శాసనమండలి బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా రామాయంపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, పాఠశాలల్లో అందుతున్న బోధన, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో తాగునీరు, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణంలో చదువుకునేలా అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండాలని సూచించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పేర్కొన్నారు.

# నాగ సుబ్రహ్మణ్యేశ్వరుడికి మహాజ్యోతి పూజ



**కాకతీయ, గీసుగొండ:** ప్రసిద్ధ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహాజ్యోతి పూజను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఊకల్ హవేలీ గ్రామంలో కొలువుదీరిన శ్రీవల్లి దేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మాలధారణ స్వీకరించిన స్వాముల భజనల నడుమ మహాజ్యోతి పూజ నిర్వహించి 12 జ్యోతులతో స్వామివారికి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు రుణ విమోచన సంఘం మాజీ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పరకాల సీఐ ప్రవీణ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వరరావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, గ్రామ సర్పంచ్ కక్కర్ల సుభాష్, కమిటీ సభ్యులు, మండల దీక్షలు చేపట్టిన స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖాతాదారుల బంగారంతో బెట్టింగ్

- బ్యాంకుకు తెలియకుండా మరో సంస్థలో తనఖా.. అసిస్టెంట్ మేనేజర్ అరెస్ట్
- మహబూబాబాద్ టౌన్ సీఐ రఘుపతి రెడ్డి వెల్లడి



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన మహబూబాబాద్ ఇండియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ భూక్య రాజేష్.. ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారు ఆభరణాలను బ్యాంకు అధికారులకు తెలియకుండా మణప్పురంలోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో తనఖా పెట్టినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదుతో ఆగస్టు 12న మహబూబాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సెప్టెంబర్ 22న రాజేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జైలుకు తరలించారు. అనంతరం కోర్టు అనుమతితో అక్టోబర్ 5న పోలీస్ కస్టడీలోకి తీసుకుని విచారించగా.. మణప్పురం ఫైనాన్స్‌లో తనఖా పెట్టిన ఖాతాదారుల సుమారు రూ.కోటి విలువైన 700.927 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. బంగారం తనఖా పెట్టిన ఖాతాదారులు బ్యాంకు అధికారులను సంప్రదించి తమ ఆభరణాలను పొందవచ్చని సీఐ రఘుపతి రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266